# పశ్చాత్తాపము

అబ్బూరి విశ్వేశ్వరరావు



మాలతి క్లాసురూంలోంచి బైటికి వచ్చింది. సుమారు నాలుగున్నర అయి వుంటుందేమో. సన్నగా తుంపరపడుతూనే వున్నది. బాగా ముసురు పట్టి వుంది. గ్రౌండు అంతా బురదమయం. జాగ్రత్తగా అడుగులు వేస్తూ స్టూడెంట్సు అంతా గేటు దగ్గరకి చేరుకుంటున్నారు. పొద్దున్ననుంచి క్లాసులో కూర్చుని విసిగిపోయిన ముఖాలకి ఉత్సాహాన్ని కోటా కొట్టి కబుర్లు చెప్పుకుంటూ బయటకు వెళ్తున్నారు. గుమ్మం దగ్గర కార్లు, రిక్షాలు ఎదురు చూస్తున్నాయి.

మాలతి గేటుదగ్గరకు వచ్చి చూసింది. వాడుక రిక్షావాడు రంగయ్య ఆవేళ బండి తీసుకురాలేదు. విసుగ్గా వున్న మాలతికి రిక్షా కనిపించక పోయేసరికి కోపం వచ్చింది. పొద్దున్నేకదా వెధవకి నెల వాడుక డబ్బు ఇచ్చింది. ఇప్పుడు నడిచి వెళ్ళాలంటే వర్షం. పోనీ కాసేపు ఆగుదామంటే ఇక తరువాత రిక్షాలు అసలు దొరకవు.

తన వాలకం కనిపెట్టినట్టున్నాడు. నెమ్మదిగా దగ్గరకి చేరాడొక రిక్షావాడు. 'ఏమమ్మా! రిక్షా కట్టమంటారా! ఈ వేళ రంగయ్యరాడు లెండి.'

'రంగయ్యకు ఏమయింది?'

'వాడా! వాడికి ఏవవుతుంది? తాగి తందనాలు తొక్కుతుంటే పోలీసులు పట్టి కెళ్ళి పోయారు.'

రంగయ్య కొంచెం వయసు మీరిన వాడే. చూడ్డానికి తాగేవాడిలాగా కని పించడే!

'ఎక్కండమ్మా! ఆలశ్యం అయి పోతుంది.'

ఆలోచించింది మాలతి. ఇంకాసేపు ఆగితే ఇంకా ఎక్కువ డబ్బు అడుగుతారు. రిక్షాలు దొరకవు కూడాను. 'సరే పద', రిక్షా ఎక్కింది మాలతి.

*　　*　　*

రిక్షా పోతోంది మువ్వలు శబ్దం చేసుకుంటూ. నీళ్ళలోంచి రిక్షాపోతోంటే విచిత్రమైన శబ్దం వస్తోంది. మాలతి మనస్సు చెదిరింది. ఎందుకో 'తాగుడు' అనే సరికి తన మనస్సు అలాగే నీరసమయి పోతోంది. రంగయ్య తాగుతాడని ఈ రిక్షావాడు ఇదివరకే చెప్పాడు. వాడు రెండు రూపాయలు తక్కువకి వాడుకగా రిక్షా తెస్తానంటే వాడినే పెట్టుకున్నారు. ఆ రోజు వీడు చెప్పాడు రంగయ్య తాగుతాడని, సరిగ్గా రిక్షా వేళకి తేడనీ...పొద్దున్నేగా డబ్బు ఇచ్చింది. వెళ్ళి తాగినట్లున్నాడు. వాడికి వచ్చే నాలుగురాళ్ళలో మూడు రాళ్ళు తాగితే, వాడికీ, వాడి పిల్లలకీ తినడానికి ఏం మిగులుతుంది?

రంగయ్యకి పెద్ద సంసారం, కథల్లో లాగా రోగిష్ఠి భార్య ఉన్నట్లు తనతో ఒకసారి కష్టాలు వెళ్ళబోసుకున్నాడు.

కొడుకులు చదువులేక తిరుగుతూ వుంటారట. తను సంపాదించి తీసుకెళితేనే ఆ రోజు ఇంట్లో బియ్యం ఉడకడం. కొడుకులు ఎదిగినా దానికి కొరగారు. ఇన్ని కష్టాల్లోవున్నవాడికి తాగుడుకూడానా! అయినా ఎవరో అన్నట్లు, కష్టాలు ఎక్కువవున్నవాళ్ళు, డబ్బు ఎక్కువవున్నవాళ్లేగా తాగేది! నిజానికి అంతే, బాగా డబ్బున్నవాడు, అసలు డబ్బులేక కష్టాలుపడేవాళ్లు మాత్రమే తాగేది! ఎక్కడో, ఒకటీ అరా తప్ప. అయితే ఒకడు కల్లుతాగితే ఇంకోడు బ్రాందీ తాగుతాడు. పోనీ రంగయ్యతాగి ఇంట్లో పడుండకూడదూ, అల్లరి, రోడ్డుమీద గోల, పోలీసులు, కేసు, జైలు ... అసహ్యం వేసింది మాలతికి. తాగేవాళ్లని చూస్తే చాలా ఏహ్యభావం కలుగుతుంది తనకి. రంగయ్య అంటే పూర్వం వున్న జాలి ఇప్పుడులేదు. ఇదివరకు వాడు ఒక బీద రిక్షావాడు. ఇప్పుడు వాడు ఒక తాగుబోతు.

సంధ్యకీ తనకీ ఎప్పుడూ ఈ విషయం మీదనే పోట్లాటవస్తుంది. 'తాగితే పెద్ద తప్పేమిటే! ఆ లెక్కకొస్తే అసలు హైదరాబాద్‌లో ప్రొహిబిషన్ లేదు తెలుసా!' పైగా అంటుంది! 'వెస్టర్న్ కంట్రీస్‌లో ఆడవాళ్లుకూడ తాగుతారు. నీవు మొగవాళ్ళు తాగితేనే ఇంత గోలచేస్తున్నావ్...'

తనకి ఒళ్ళుమండి వెంటనే అంది, 'నీవూవెళ్లి ఒకముంత పుచ్చుకొనిరా...'

అదిమాత్రం నవ్వుతూనే అన్నా ఆ మాటలు తను మర్చిపోలేదు. 'ఇంత కబుర్లు చెబుతున్నావ్! చూడవే! నీ మొగుడు ఎలాటివాడు వస్తాడో. ఇరవై నాలుగు గంటలు డోసుపడే వుండకపోతే చూడు. అయినా తాగని మొగాడు ఎవడే అసలు. కొంచెం హెచ్చుతగ్గులు తప్ప...'

'ఏడిశావులే కబుర్లు, ఎవడైనా తాగుతాడని అనుమానం కలిగినా వాడిని అసలు చూడడానికే రానివ్వను...'

అది అంటుంది: 'మ్యారేజెస్ ఆర్ మేడిన్ హెవెన్. అంటే వివాహాలు స్వర్గంలోనే అయిపోతాయట. తాగేవాడు తాగేవాడులాగా కనపడతాడా? లేకపోతే ఏమండీ! నాను తాగుడు అలవాటువుంది. మీరూ అలవాటు చేసుకోగలిగితేనే చేసుకోండి అంటాడా! అంతచెప్తున్నావ్! పెళ్లి అయ్యాక నీ నాథుడికి సారాయము మొదలగు మత్తుపదార్థములు అలవడితే...'

తనకి ఒళ్లుమండింది. 'సంతోషించాం నీ పదజాలానికి. నాసంగతి ఏమైనా నేను భరిస్తానుగానీ, నీకొక చిన్నసలహా... ఒక చక్కని బార్ ప్రొప్రయిటర్ని పెళ్లి చేసుకోవే! ఇద్దరూ తిండీతిప్పలూ మానేసి హాయిగా తాగుతూవుండొచ్చు.'

ఆలోచనా పరిధినుంచి అకస్మాత్తుగా బయటకువచ్చింది మాలతి. రిక్షా మెయిన్ రోడ్‌మీదనుంచి పోతోంది. సెంటర్‌కి కుడి పక్కగా జనం చేరివున్నారు. ఏదో అందరూ మాట్లాడుకుంటున్నారు. పోలీసువాళ్లు ఇద్దరు ఒకడ్ని లాక్కెళుతున్నారు. వాడు మొండికేస్తున్నాడు. 'ఆ! ఏంలేదు. ఎవడో తాగినట్లున్నాడు. అదీగోల' దారినపోయే ఆయన ఇంకో ఆసామీతో అన్నమాటలు మాలతి చెవిలోకి చొచ్చుకుపోయాయి.

మాలతికి ఒళ్లు గగుర్పొడిచింది. ఏమిటో ఇవాళ లేచినప్పటివేళ. ఎక్కడ చూసినా తాగుడు. ఫస్టుతారీఖు రోజులని కాబోలు. కుడిపక్క 'ఇచ్చట పర్మిట్లపై బ్రాందీ అమ్మబడును.' అని బోర్డు కనిపించింది మాలతికి. కొన్నిరోజులుపోతే తప్పకుండా దొంగతనాలకీ, హత్య చేయడానికి లైసెన్సు ఇస్తారు. అప్పుడు, నాగరికత పరాకాష్ఠ చేరుకున్నట్లు లెక్క. లేకపోతే ప్రొహిబిటెడ్ ఏరియాస్‌లో పర్మిట్లు, కల్లుముంతలు. తను ప్రైమ్ మినిస్టర్ అయితే బాగుండును. తాగినవాళ్లకి కాపిటల్ పనిష్‌మెంట్. అంతేకాదు మొత్తం ఇండియాలో అన్ని డిక్షనరీస్‌నుంచి బ్రాందీ, విస్కీలాటి మాటలు తీసేయించాలి.

ఇల్లుదగ్గర పడింది. సరిగ్గా గేటు ముందర ఆపాడు రిక్షావాడు. డబ్బులిచ్చి లోపలికి వెళ్లబోయింది. ఇంతలోకే వాడే అన్నాడు. 'అమ్మా! రేపటినుంచి నన్ను రిక్షా తెమ్మంటారా!' ఇక తనకి ఆ తాగుబోతు వెధవ రిక్షా ఎందుకు. 'తీసుకురా! సరిగ్గా తొమ్మిదిన్నరకి వచ్చేయాలి!' 'సరేనండమ్మా' హుషారుగా వెళ్లిపోయాడు వాడు. మనస్సును ఆలోచననించి మార్చింది మాలతి.

* * *

బయట ఇంకా సన్నగా చినుకులు పడుతున్నాయి. కప్పలు విచిత్రంగా అరుస్తున్నాయి. చల్లటిగాలి వీస్తోంది కిటికీలోంచి. బాదంచెట్టుమీద పక్షి రెక్కలాడిస్తోంది మధ్య మధ్యన. టేబిల్ లాంప్‌చుట్టూ రెండో మూడో దీపం పురుగులు తిరుగుతున్నాయి. మనస్సు ప్రశాంతంగావుంది మాలతికి. సాయంత్రపు ఆలోచనల్నించి దూరంగాపోయింది మనస్సు. చేతిలో వున్న ఇంగ్లీషునవల 'ది గుడ్ ఎర్త్' ఆవతలపెట్టి ఆవలించింది. హాల్లో ఇంకా లైట్ వెలుగుతోంది. హాల్లోకి వెళ్లింది మాలతి.

అన్నయ్య కుర్చీలో కూచుని ఏదో రాసుకుంటున్నాడు. నిశ్శబ్దంగా వుంది. అన్నయ్య తలెత్తి చూశాడు. 'ఇంకా నిద్రపోలేదా'- 'లేదు! టైమ్ ఎంతయింది!' 'పదిన్నర అయివుంటుంది.' మళ్లీ రాసుకోడంలో నిమగ్నమైపోయాడు. ఐదునిమిషాలు కుర్చీలో కూర్చుంది మాలతి. ఎదురుగా టేబిల్ మీద 'లైఫ్' మాగజైను కనిపించింది. చక్కటి ఫొటోలు. 'ఎంత బాగుంది ఈ పెద్దపులి!' అనుకుంది మాలతి నెమ్మదిగా పేజీలు తిప్పుతూ. ఎడమ పక్క పెద్ద ఎడ్వర్టయిజుమెంట్. 'ప్యాక్ విస్కీ' ఆ బొమ్మలో ముగ్గురు ఆడవాళ్ళు, ఒక యువకుడు మూడు గ్లాసుల్లో పోసుకుని తాగుతున్నారు ఒక పడవ మీద కూర్చుని. వాళ్ల ముఖాలలో ఆనందం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దీని విషయం తను సాయంత్రం అల్లా తల పగలకొట్టుకుంది. మళ్లీ మొదలు.

**1968 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుపైద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలో జరుగు



ముఖ్య సంఘటనల అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, నౌకరీలో ప్రమోషన్ ట్రాన్స్‌ఫర్లు, పిల్లల జననం, వివాహ సుఖ సంతోషాల మరియు చెడు నక్షత్రముల శాంతి చేయు కొన్ని విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజి అదనం. [illegible]

PT DEV DUTT SHASTRI
Raj Jyotshi, (APM) P. B 86,
JULLUNDUR CITY.

**3 నెలలు ఉచిత బహుమతి**



స్త్రీలకు అందాన్నిచ్చే కాశ్మీర్ ఆర్ట్ చీరెలు. సరిక్రొత్త ఆకర్షణీయమైన నమూనాలలోను రంగులలోను యిబ్బుతువుకు తగినట్లున్నా వన్నెగల పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్ చీర రు. 11 లు; 2 రు. 20 లు; 3 కి రు. 28 లు; 4 రు. 36/- రెండు లేక అంతకు పైగా చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును పోస్టు పార్శిల్ ద్వారా పంపెదము.

ARVIND AGENCIES (APW-22)
P. B. 1408. Delhi-6.

భద్రతకు, రక్షణకు ఫోల్డింగ్ 50 షాట్ల పిస్టల్ లైసెన్సు అక్కర్లేదు. అమెరికన్ మోడల్ దొంగలు, క్రూరమృగాలనుండి రక్షించుకోండి. పిక్‌నిక్ ప్రయాణములు నాటకాలకు పయోగకరమైనది



ఆటోమాటిక్ 50 షాట్లు ఏర్పాటుగలది. తేలికైనది. విష్పురుష్యులు [illegible] అపాయంనుండి రక్షిస్తుంది. జర్మన్ మోడల్ నెం. 99 50 షాట్లుగల దర. రు. 15 50. వి.పి.పి. చార్జీలు రు2-50. తోలుకేస్ రు 3-50 అదనం షాట్లు వందకి రు5. మిలిటరీ జవాన్లకు, ఆఫీసరకు ప్రత్యేక తగ్గింపు

ATLAS CO ( -16)
P. O. Box 1329 Delhi 6

# ప్లాటినమ్

ఎందుకింత భయం తనకి. ఒళ్ళు గగుర్పొడిచింది. ఒక తాగినవాడు తన చిన్నతనంలో వీధి చివర్న వుంటున్న తమ మేష్టారును ఏం చేస్తున్నాడో తెలియక కత్తి పెట్టి పొడిచేశాడు. తన కాబోయే మొగుడు...ఆ వర్షం, ఆ చలిగాలి, ఇప్పుడు విసుగనిపిస్తున్నాయి మాలతికి.

'ఏమిటి అది! అంత దీక్షగా చూస్తున్నావ్!' అన్నయ్య ప్రశ్నతో తలెత్తి చూసింది మాలతి. తొంగి చూశాడు.

'ఓహ్! ఇదా! బొమ్మ చూస్తే ఏముంది. దాని రుచి చూడాలి. అప్పుడు తెలుస్తుంది. ఇలాంటప్పుడు రెండు పెగ్గులుంటే...ఓహ్!...' నోరు చప్పరించుకున్నాడు. 'ఛీ! ఛీ'

'ఛీ?! ఇప్పుడలానే అంటావ్ లే! ఒకసారి రుచిచూస్తే ... మళ్ళీ వదిలిపెడతావేమిటి నువ్వు!'

మతిపోయింది మాలతికి. రుచి చూడాలట తను కూడా! వాడి మీద తనకి ఎంత హై ఒపీనియన్ ఉండేది! అయితే వాడూ తాగుతాడన్నమాట. సంధ్య చెప్పింది నిజమేనేమో! అయితే అన్నయ్యకీ రంగయ్యకీ తేడా ఏమిటి! సంధ్య అయితే తప్పకుండా అంటుంది 'ఒకడు నాటు సారా, ఒకడు స్కాచ్ విస్కీ' అని.

టేబిల్ లైట్ ఆర్పి, బెడ్ లైట్ వేసి వచ్చి పక్కమీద పడుకుంది మాలతి. నిద్రపట్టడం లేదు. కళ్ళుమూసుకుంటే రంగయ్య, అతని భార్య పిల్లలూ, పోలీసులు, స్కాచ్ విస్కీ ఎడ్వర్టైజుమెంట్ గుర్తుకొస్తున్నాయి. భోరున ఏడవాలనిపించింది మాలతికి.

తనకి చిన్నప్పట్నించి తాగడమంటే భయం. తమ వీధిచివర మేష్టారుని ఒక తాగుబోతు ఉత్తి పుణ్యానికి చంపేశాడు. తమ పక్కింట్లో ఒక ఫారెస్టు రేంజర్ వుండేవాడు. ఆయనను అంతా ఎంతో పెద్దమనిషి అనేవారు. ఆఫీసునుంచి ఇంటికి రాగానే ఆయన పెద్దపులి అయేవాడు. ముందర రాగానే ఇంట్లో అందరితో బాగానే వుండేవాడు. బీరువాలోంచి సీసా తీసి తాగేవాడు. అంతే...యముడే మనిషి. భార్యని గొడ్డుని బాదినట్లు బాదేవాడు. డబ్బులిమ్మని వేధించేవాడు. రాను రాను ఇంట్లో అసలు డబ్బులు ఇచ్చేవాడు కాదు. ఇంట్లో తినడానికి వుండేదికాదు. పిల్లల్ని బాదేవాడు. ఈ బాధలు పడలేక ఆ మహా ఇల్లాలు తాడూ—దూలం వెతుక్కుంది. పిల్లలు వీధిన పడిపోయారు. తరువాత అతని వుద్యోగం పోయింది. ఎటుపోయాడో తెలియదు.

తనను చూడడానికి ఎల్లుండి ఎవరో వస్తున్నారుట. అతను ఎం.బి.బి.యస్. పేరు చంద్రశేఖర్. చంద్రునికున్నా మచ్చ వుంటుందిగాని అతనికి లేదుట. సరే అది ఎక్స్‌టర్నల్ మరి గుణగణాలు. ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ మాన్ అనేది కొంచెం తప్పే. పూర్తిగా ఎవడి గుణగణాలు అంచనావేయడం సాధ్యం కానిపని. ముఖ్యంగా ఎందుకంటే ఆ రేంజరు ఎంతో సాధువుగా వుండేవాడు చూడటానికి. ఎవరైనా ఆయన తాగుతాడని చెబితే నవ్వుతారు తప్పకుండా! కానీ అందరూ చెప్పడం ఆ చంద్రశేఖరుడు ఆఖరికి సిగరెట్టు కూడా కాల్చేవాడిలా లేడని. అలా అయితే అతనికి తప్పకుండా తాగే వాళ్ళంటే తనలాగా అసహ్యం అయివుంటుంది. తన తెలివితేటలు వుపయోగించి ఆయనకు వాటిమీద మనస్సు పోకుండా జాగ్రత్తగా చూడాలి. కలత మనస్సుతోనే నిద్రపోయింది మాలతి.

* * *

ఆరోజు మాలతి కాలేజీకి వెళ్ళలేదు. పొద్దున్నే సంధ్యకూడా వచ్చింది. తలంటి పోసుకుంది మాలతి. సింపుల్‌గా అలంకరించుకుంది సంధ్య ఏవో ఛలోక్తులు విసురుతోనేవుంది. తను అవన్నీ పట్టించుకోవటం లేదు. చూడడానికి ఇంకో గంటలో వస్తారని ఫోన్ చేశారు. ఇంట్లో అంతా హడావుడిగా వున్నారు.

పదకొండు గంటలకి వచ్చారు వాళ్ళు. అతనూ, తల్లీ, తండ్రీ వచ్చారు. మాలతి హాల్లోకి వెళ్ళింది నెమ్మదిగా. అతనితోటి అన్నయ్య ఏవో మాట్లాడుతున్నాడు. ఇద్దరూ నవ్వుకుంటున్నారు. మాలతి తలెత్తి చూసింది. బుద్ధిమంతుడిలాగానే వున్నాడు. నిజంగానే



వేసవి
కాలములో
చర్మ
బాధలను పొందకుండుటకు




సల్ఫర్
టాయిలెట్ సోపు
మొటిమలు, చమట పొక్కులు, వ్యాప్యమైన యితర చర్మ బాధలను పోగొట్టి సుఖము నిచ్చును.

BENGAL CHEMICAL
CALCUTTA-BOMBAY-KANPUR

## రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

## ప్లాటినమ్

చంద్రుడికి వున్న మచ్చ గూడా లేదు. ఏవో ప్రశ్నలు వేశాడు. యాంత్రికంగా జవాబు చెప్పింది మాలతి. అడుగులో అడుగువేసుకుంటూ లోపలికి వెళ్లిపోయింది.

ఆ రోజల్లా అతని గురించే ఆలోచించింది మాలతి. అందంగానే వున్నాడు. మంచి ఉద్యోగంలో వున్నాడు. బొచ్చుకుక్క వుందో లేదో గాని బ్యూక్ కారు మాత్రం వుందిట. మొహం చూస్తుంటే చాలా అమాయకుడిలా వున్నాడు. తను అనుమానించిన దురలవాట్లు ఏమీ అతనికి లేవు. తను ఎందుకు దృఢంగా అనుకుంటోందో కాని, అది మాత్రం నిజం.

*　　*　　*

అందమైన కలలాగా జరిగిపోయింది మాలతి పెళ్లి. అనుకున్నన్ని రోజులు పట్టలేదు. మాలతి, అతను బయలుదేరారు. కారులో కూర్చున్నారు ఇద్దరూ. కొబ్బరికాయ కొట్టాక కారు బయలుదేరింది.

సిమెంటురోడ్డు మీద బాణంలా దూసుకుపోతోంది కారు. పచ్చటి పైరు మీద నుంచి గాలి వీస్తోంది. మబ్బు మబ్బుగా వుంది వాతావరణం. మాలతి ఆనందంతో మునకలు వేస్తోంది.

ఏదో శబ్దం అయితే ఇటు తిరిగి చూసింది మాలతి. అతను అగ్గిపుల్ల గీస్తున్నాడు. మాలతి కొద్దిగా ఆశ్చర్యపడింది. 'ఇతే తననుకున్నట్లు పర్‌ఫెక్టు కాదన్నమాట. సిగరెట్లు కాలుస్తాడు. ఇంతటితో అయితే చాలు అనుకుంది' తనకి సిగరెట్ పొగ గిట్టదు. మాలతి పొడిగా అడిగింది 'మీరు సిగరెట్లు కాలుస్తారా!'

'హహ్హాహ్హా' అని నవ్వాడతను. సినిమాలో కీచకుడి నవ్వులా వుంది ఆ నవ్వు.' 'మీరు హత్యలు చేస్తారా అని అడిగినట్లు అడుగుతావేం! ఇంకా నయం—మీరు మంచి నీళ్లు తాగుతారా అని అడగక పోయావు?'

అతని మాటల్లోని వెటకారానికి బిత్తరపోయింది తను. ఏమన్నదనీ తను?

'ఏం! ఎందుకలా అడిగావ్!'

'నాకు సిగరెట్ పొగ పడదు'

'అలవాటు చేసుకో. నన్ను చేసుకున్నందుకు' అదేదో జోక్‌లా నవ్వాడు అతను. 'ఒకటి వెలిగిస్తావేమిటి! అయినా ఈ కాలంలో సిగరెట్‌పొగ పడకపోవడమేమిటి! సిగరెట్లు తాగనివాడు, అప్పుడప్పుడు డోస్ లేనివాడూ వుంటాడా ఎక్కడన్నా!' డోస్ అని విన్న మాలతికి నోటివెంట మాట రాలేదు.

'అయితే అయ్యగారు మందువారన్న మాట!' మాలతి గుండె మెదడు పని చెయ్యడం మానేశాయనే చెప్పచ్చు.

*　　*　　*

కాలండర్‌లో రెండు కాయితాలు మారాయి. బరువైన కాలచక్రం తన బరువంతా మాలతిమీదే మోపింది. ఒక హద్దువరకు మానవుడు ఒకటి జరగకూడదనుకుంటాడు. ఆ హద్దు సమీపిస్తే, ఆహద్దు దాటకుండావుంటే బాగుండుననుకుంటాడు. మాలతి విషయంలో ఇదే జరిగింది.

ఇప్పుడు అతను ఇంట్లో ముందర గదిలో పేకాడుతున్నాడు. ఆఫీసుకి ఎప్పుడూ వెళ్లినట్లు కనిపించడు. బ్యూక్‌కారు ఏమయిందో! వాళ్లు 'కాలాతీత వ్యక్తులు.' కాలానికి వాళ్లకి సంబంధం లేదు. వాళ్లకి గడియారాలతో పనిలేదు. తాగాలనిపిస్తే తాగడం, తినాలనిపిస్తే తినడం, కళ్లుమూతలుపడితే నిద్రపోడం.

వెనుకగదిలో నీరసంగా పడుకునివుంది మాలతి. ముందుగదిలోంచి పకపకలు వినిపిస్తున్నాయి. కేకలు, సోడ శబ్దాలు, పేక కలిపిన శబ్దం—ఆమె గుండెను ముక్కలు చేస్తున్నాయి. ఏదైతే జరుగకూడదనుకుందో,—'ఆఖరికి కలలోగూడా,'— అదే జరిగింది. కళ్లుమూసుకుంది మాలతి.

'ఏమిటా మొద్దునిద్ర! ఒంటిగంటవ్వా కాకుండా' అతను ఎప్పుడొచ్చి లోపలికి వచ్చాడో మరి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

'ఏమిటో పడుకుంటే నిద్రవచ్చేసింది!' భోజనానికి పదండి. వంటింట్లోకి దారితీసింది మాలతి.

'ఆ! ఇప్పుడేపోకపోతే తక్కువ. ఉసురోమంటూ పెట్టకపోతే ఏంలే! ఈపూట

తినవంతమాత్రాన నేనేం చచ్చిపోను. చచ్చినా ఈ పతివ్రత అన్నం పెట్టక మాడ్చి చంపిందని ఎవరూ అనరు.'

కేకలు వేశాడు అతను.

దుఃఖం వచ్చింది మాలతికి. ఇవాళ డోస్ ఎక్కువ పడింది. 'అయినా ఆపేక, ఆ తాగుడూ ఎందుకండీ' రుద్ధకంఠంతో ప్రశ్నించింది.

'తాగుడా! అదేమిటేవ్! గవర్నమెంటు వాళ్ళే నన్ను పట్టుకోరు. నా గొప్పని గుర్తించి నాకు పర్మిట్ ఇచ్చారే! మధ్య నీ వెవరివి? అయినా అర్ధరాత్రి ఏమిటే శోకాలు! నేనేదో నిన్ను కొట్టి చంపుతున్నట్లు...'

'అయినా అదొకటే తక్కువ. నానా లంటే కొట్టండి...' విసురుగా అంది మాలతి.

'నేను తాగితే నీకేం మధ్య ?' భర్త తాగితే భార్యకేమి నాదా! ఏమిటితని మాటలు! 'ఈసారి నా విషయంలో కలుగ చేసుకొన్నావంటే......' చేతిలో పేపరు వెయిట్ పైకి ఎత్తాడు.

*          *          *

ఉలిక్కిపడి లేచింది మాలతి. తను తన మంచంమీద...'కల' ఎంత భయంకరమైన కల...రాత్రి అలా ఆలోచించడం వల్లనే అలా వచ్చింది.

స్నానంచేసి భోజనంచేసి కాలేజీకి బయలుదేరింది మాలతి. కొత్త రిక్షా వాడు వేళకిముందే రిక్షా తీసుకొచ్చాడు.

ఇంకా లెక్చరర్ రాలేదు. స్టూడెంట్సంతా కబుర్లు చెప్పుకుంటున్నారు. సంధ్య పక్కన వెనకబెంచీలో కూర్చుంది మాలతి. సంధ్యకి తన కలంతా చెప్పింది. అంతా విని నవ్వింది సంధ్య. 'ఇంత భయం దేనికే! ఇలాగే భయపడుతూవుండు. అయినా తెల్లవారుజామునవచ్చిన కలలు...' చెవులు మూసుకుంది మాలతి. కలలోనే భరించలేకపోయింది. నిజంగా అలాటి వాడువస్తే...రానీ! తనకేం ! బియస్సీ ప్యాసవుతోంది. డిగ్రీవుంటుంది. డైవోర్సు ఇచ్చేసి హాయిగా బతుకుతుంది. లెక్చరర్ రావడంతో ఆలోచన నిలిచిపోయింది.

*          *

మూడు నెలలు గడిచిపోయాయి. బాగా వడగాలి వీస్తోంది ఆరోజు. మధ్యాహ్నం మూడయివుంటుందేమో ! ఆవూళ్ళో అది ఒక కొత్తకాలనీ. ఇళ్ళన్నీ కొత్తగా కట్టారు. అన్నీ చక్కటి డాబాలే. ఇంకా కొన్ని కడుతున్నారు. ఆ ఇళ్ళల్లో అన్నింటిలోకీ హుందాగా వుంది ఒక పచ్చ మేడ. ముందుకి ఎయిర్ కండిషనిర్ కనిపిస్తోంది. ఇంటిముందు పూలమొక్కలున్నాయి. పెద్ద తలుపులగేట్లు రెండు వున్నాయి. పోర్టికోలో ఒక చిన్నకారు వుంది. ఆ ఇంటిముందే రిక్షా దిగింది సంధ్య.

గేటు దగ్గర నేమ్‌ప్లేట్ మీద బంగారు రంగు అక్షరాలతో డాక్టర్ చంద్రశేఖర్ అని వుంది. లోపల కిటికీ లోంచి చూసింది మాలతి సంధ్యని. 'హల్లో సంధ్యా! ఏమే! ఇంత ఎండెన్నెట్లో వచ్చావ్! ఇంటికీ ఫోన్ చేస్తే కారు పంపించే దాన్నిగా! అసలే ఒకకారు ఊరికినే పడుంది.'

'లోపలికి రానీయవే! కాసిని మంచి నీళ్ళివ్వు.'

'మంచినీళ్ళేం ఖర్మ! డ్రింకే ఇస్తాలే' గబగబా లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో వచ్చింది మాలతి.

డ్రింక్ తాగి గ్లాసు బల్లమీద పెట్టింది సంధ్య. 'చల్లగాలేదు కదూ! ఫ్రిజడైర్‌లో బాగా చల్లబడటంలేదు. అయినా మా వారు ఇంకో ఫ్రిజిడైర్‌కి ఆర్డర్ ఇచ్చారు.'

మాలతిలో మార్పు వచ్చింది. ఇది వరకటిలా ముద్దరాలు కాదు. వసపోసిన పిట్టలాగా వాగుతోంది. ఎంతసేపూ వాళ్ళాయన సంగతులు. ఆయన ఏఏదేశాలు చూశారో, ఏ ఏ ఫర్నిచర్ ఎంతకు కొన్నారో, ఇంకా ఎన్నింటికి 'ఆర్డర్' ఇచ్చారో, ఏఏ బహుమతులు వచ్చాయో. ఊరికే చెప్పుకుపోతోంది. ఖరీదైన చీర కట్టుకుంది.

చిన్ననాటి కబుర్లు చాలా చెప్పుకున్నారు ఇద్దరూనూ. బైట వున్నవారు తన వాడకానికిట వాళ్ళాయన నెలకి మూడువేలు సంపాదిస్తాడట. అది కాక తాతలనాటి ఆస్తి వుందిట' మూడు వేలూ వాళ్ళకి ఏదో సరిపోతయిట. మాలతేనా ఇలా మాట్లాడుతోంది అనుకుంది సంధ్య.

'ఓసి! మతిలేనిదాన్ని! ఇల్లు చూపించనేలేదు! రా. లోపలికి వెళదాం' ఇద్దరూ లోపలికి వెళ్ళారు. వాళ్ళ ఆయన విజిటర్స్‌ని కూర్చోపెట్టే రూం చూపించింది. గోడలకి ఏవో కేలండర్లు వేలాడుతున్నాయి. మంచి సీనరీలు కూడ తగిలించి వున్నాయి. పైన సీలింగ్ ఫేన్, మూల ఒక స్టాండ్‌లైటు వున్నాయి. రూమ్‌లో కార్పెట్ పరిచి వుంది.

ఇల్లంతా చక్కని ఫర్నిచర్, గాలీ వెలుతురూ వచ్చే గదులు. గోడలకి చక్కని సీనరీ ఫటోలు. ఆ ఇల్లు నిజంగా నచ్చింది సంధ్యకి.

వంటింట్లోకి నడిచారు ఇద్దరూ. గ్యాస్ స్టౌవుంది. ఒకమూల ఫ్రిజ్‌డైర్. ఎత్తుగా బల్లమీద స్టీల్‌సామాను. అంత చాలా మోడర్న్ కుకింగ్.

'అదృష్టవంతురాలివే! బంగారంలాటి మొగుడు, స్వర్గంలాటి ఇల్లూనూ.'

మాలతి నవ్వింది. 'బంగారం ఏమిటే నీమొహం, ప్లాటినమ్ అయితేనూ. అయినా నీకు ఏదో తక్కువయినట్లు...'

గదిలోకి వచ్చారు ఇద్దరూను. వాళ్ళాయనకువచ్చిన కప్పులు, ప్రెజెంటేషన్లు చూపిస్తోంది మాలతి. క్లబ్బులో తీసిన ఫోటోలు. పరధ్యానంగా మాలతి చెప్తున్నది వింటూ గోడమీద ఫోటోలు చూస్తోంది సంధ్య. యాదాలాపంగా బీరువా తెరిచింది సంధ్య.

నోటమాట రాలేదు సంధ్యకి. 'ఏమిటే అలా చూస్తావ్! అది అంతా ఫారెన్ సరుకు. ఇండియన్ బాటిల్ ఒక్కటి కూడాలేదు. ఎంత ఘాటనుకున్నావ్ ! మనం వాసన చూస్తేనే పడిపోతాం. అంత స్ట్రాంగ్. అయినాసరే! ఆయన సీసాలు సీసాలు పట్టించినా పిసరుకూడా మత్తు రాదు తెలుసా' గుండ్రంగ కళ్ళు తిప్పుతూ మాలతి అంటోంది. ఆమె కళ్ళుచూస్తే చాలు తెలుస్తుంది ఆమె ఎంతగర్వపడుతుందో! బహుశా బ్రహ్మదేవుడు ఆ మాటలువింటే తన సృష్టి మానుకుంటాడేమో!

సంధ్య తెల్లబోయింది అంది. 'ప్లాటినమ్ మొగుడు కదూటే మరి.' ●